ఈనాడు
సంగారెడ్డి
మంగళవారం జూన్ 2, 2026

తగ్గిన జీరో బిల్లులు

వేసవిలో పరిమితికి మించి విద్యుత్తు వినియోగం

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి టౌన్

- సంగారెడ్డి పట్టణానికి చెందిన ఓ వినియోగదారుడికి గృహజ్యోతి పథకం ద్వారా ఏడాదిగా జీరో బిల్లు వచ్చేది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మండిపోవడం.. ఉక్కపోతతో ఇంట్లో విద్యుత్తు వినియోగం పెరిగింది. 200 యూనిట్లకు పైగా విద్యుత్తు వాడటంతో మే నెలలో రూ.943 బిల్లు వచ్చింది. రాయితీ దక్కలేదు.
- కందికి చెందిన ఓ వినియోగదారుడికి గత రెండేళ్లుగా జీరో బిల్లు వచ్చేది. ఈసారి మే నెలలో 248 యూనిట్ల వరకు వినియోగించడంతో రూ.1245 బిల్లు వచ్చింది. ప్రభుత్వ రాయితీని కోల్పోయారు.

జిల్లాలో ఎండలు మండుతున్నాయి. జనం ఇళ్లు వదిలి వెళ్లడానికి జంకుతున్నారు. ఉక్కపోతతో విలవిలలాడుతున్నారు. దీంతో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం వల్ల విద్యుత్తు మీటర్లు గిరగిరా తిరుగుతున్నాయి. ఇప్పటి వరకు 200 యూనిట్ల వరకు విద్యుత్తు వాడితే.. ఆ శాఖాధికారులు బిల్లులో పూర్తి రాయితీ ఇస్తూ.. జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. ఇళ్లలో విద్యుత్తు వాడకం పెరగడం వల్ల 200 యూనిట్లకు మించుతోంది. దీంతో పరిమితికి మించి వినియోగంతో లబ్ధిదారులు పూర్తి బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది మే నెలలో గృహజ్యోతి లబ్ధిదారుల్లో 6,816 మంది 200 యూనిట్లకు మించి వినియోగించారు. ఈ ఏడాది మే నెలలో 22,122 మంది 200 యూనిట్లకు మించి వాడారు. 200 యూనిట్లకు మించి విద్యుత్తు వినియోగించిన వారు బిల్లులు తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని ఆ శాఖ ఎస్‌ఈ సుధీర్ కుమార్ తెలిపారు.

గతేడాది మే నెలతో పోల్చితే..

విభాగం	2025	2026
జీరో బిల్లుల లబ్ధిదారులు	2,00,706	2,03,255
200 యూనిట్లు దాటినవారు	6,816	22,122

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం

పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ మైదానం సిద్ధమైంది. పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మైదానాన్ని అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లను సోమవారం ఎస్పీ పరితోశ్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి పరిశీలించారు. జిల్లా కలెక్టరేట్‌ను సైతం విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు.

సేవలకు దక్కిన పురస్కారం: అంకిత భావంతో విధులు నిర్వహించిన పోలీసులకు సోమవారం ప్రభుత్వం పలు పతకాలు ప్రకటించింది. మహోన్నత సేవా పతకానికి సంగారెడ్డి ట్రాఫిక్ ఎస్సై సాయిలు, ఉత్తమ సేవా పతకానికి ఎస్బీ ఎస్సై కె.సిద్ధిరాములు, సేవా పతకాలకు జోగిపేట ఎస్సై బి.దుర్గయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి, జోగిపేట హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రావు, ఎస్బీలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ వాజిద్‌పాషా ఎంపికయ్యారు.

అంతా పతి.. అంతే సతి

- బల్దియాల్లో పెరిగిన మహిళా ఛైర్మన్ల కుటుంబీకుల పెత్తనం

ఈనాడు, సంగారెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 20 బల్దియాలున్నాయి. వీటిలో 13 మున్సిపాలిటీలకు మహిళలే ఛైర్‌పర్సన్లు. మెజారిటీ బల్దియాల్లో వారి కుటుంబ సభ్యులే పెత్తనం చెలాయిస్తూ.. ఛైర్‌పర్సన్లను సంతకాలకే పరిమితం చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఛైర్‌పర్సన్ భర్త కౌన్సిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేసిన తీరే ఇందుకు నిదర్శనం.

అధికారిక కార్యకలాపాల్లో ఛైర్‌పర్సన్ భర్త జోక్యంపై నిరసన తెలుపుతున్న నర్సాపూర్ కౌన్సిలర్లు

తీవ్ర విమర్శలొస్తున్నా..

- సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, సదాశివపేట, ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం పురపాలక సంఘాల్లో మహిళలు ఛైర్‌పర్సన్లుగా బాధ్యతలు చేపట్టారు. - ఇటీవల సంగారెడ్డిలో ఛైర్‌పర్సన్ భర్తకు ప్రొటోకాల్ పరంగా ఎలాంటి పదవి లేకపోయినా ప్రగతి పనులను తనిఖీ చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఓ బల్దియాలో ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్ అంతా తానై వ్యవహరిస్తున్న తీరుపై పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈయన వైఖరి నచ్చక కమిషనర్ సెలవుపై వెళ్లిపోయారు. - సదాశివపేట బల్దియాలో ఛైర్‌పర్సన్ భర్తదే పెత్తనం. కౌన్సిల్ సమావేశాలకు ఎలాంటి పదవి లేకుండా హాజరైతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో కో-ఆప్షన్ సభ్యుడిగా ఇటీవల ఎన్నికయ్యారు. - రామాయంపేట పురపాలికలో ఛైర్‌పర్సన్ భర్త అధికారిక సమావేశాల్లో ఆమె తరపున ప్రసంగిస్తూ అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారనే విమర్శలున్నాయి. మెదక్ జిల్లాలోని రెండు పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి. -

జిల్లా	పురపాలక సంఘాలు	మహిళా అధ్యక్షులు
సంగారెడ్డి	11	5
మెదక్	4	4
సిద్దిపేట	5	4

- మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ స్థానం పక్కన ఆమె భర్త మరో సీట్లో ఆసీనులై వ్యవహారాలను చక్కబెడుతున్నారు.

అడ్డుకోవాల్సిన వారే సహకరిస్తూ..

పాలనలో మహిళా ఛైర్‌పర్సన్ల కుటుంబీకుల పెత్తనాన్ని అడ్డుకోవాల్సిన కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు వారికి అండగా నిలుస్తున్నారు. ఛైర్‌పర్సన్ల భర్తను సైతం ఛైర్మన్‌గా సంబోధిస్తూ కార్యాలయాల్లో ప్రత్యేక స్థానం కేటాయిస్తున్నారు. ఆదేశాలు పాటించడమే కాకుండా.. కీలక దస్త్రాలను సైతం వారి వద్దకు పంపిస్తూ ఆమోదం తీసుకుంటున్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో అతివలు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారు. పాలనలో స్వేచ్ఛనిస్తేనే పట్టణాలను ప్రగతి పథంలో పయనింప చేస్తారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల సంఘాల్లో ఛైర్‌పర్సన్లు విద్యావంతులైనప్పటికీ పాలనలో స్వేచ్ఛ లేకపోవడంతో అధికారిక సమావేశాలకే పరిమితమవుతున్నారు.

వడివడిగా.. ప్రగతి దిశగా..

- నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి టౌన్

ప్రజల ఉద్యమాలు.. పోరాటాలు.. త్యాగాల ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర స్వప్నం సాకారమయింది. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు చొరవ చూపుతున్నారు. పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు, మహిళల అభివృద్ధికి రుణాలు, ఆర్టీసీలో అతివలకు ఉచిత రవాణా, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం.. ఇలా పలు పథకాలతో ప్రజలు లబ్ధిపొందుతున్నారు.

ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్యం



పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. రూ.10 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు అమలు చేస్తున్నారు. పేదలకు ఖరీదైన వైద్యం అందుతుండటంతో వారికి ఊరట దక్కుతోంది.

- రెండున్నర ఏళ్లలో ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు: 47,998
- ఇప్పటి వరకు వ్యయం: రూ.135 కోట్లు

పేదల సొంతింటి కల సాకారం



జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల తొలి విడత కార్యక్రమం చివరి దశకు చేరింది. సోమవారం కొన్ని గృహ ప్రవేశాలు చేపట్టారు. ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోంది. రెండో విడతకు సంబంధించి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లను ఇటీవల ప్రభుత్వం కేటాయించింది.

తొలి విడతలో..
- మంజూరైన గృహాలు :12,823
- ఇంకా పనులు చేపట్టనివి: 3983
- వివిధ దశల్లో..: 6954
- పూర్తయిన ఇళ్లు: 1886

ఆకలి తీరుస్తున్న సన్నబియ్యం

ప్రజా పంపిణీ దుకాణాల ద్వారా గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. వీటిని తినేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపేవారు కాదు. బియ్యం తీసుకోగానే విక్రయించే పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొస్తూ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తోంది.

- జిల్లాలో రేషన్ దుకాణాలు: 855
- మొత్తం కార్డులు: 4,42,746
- లబ్ధిదారులు: 14,93,876
- ప్రతినెలా బియ్యం కోటా: 8వేల మెట్రిక్ టన్నులు

ఆర్థిక అక్షరాస్యత.. మహిళా సాధికారత

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా స్వయం ఉపాధి యూనిట్లను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే సంగారెడ్డిలో పెట్రోల్ బంకు నిర్వహిస్తుండగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి రుణాలు మంజూరు చేస్తూ వ్యాపారాల విస్తరణకు చేయూత అందిస్తున్నారు.

- జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలు: 16,789
- ఈ సంవత్సరం రుణాల లక్ష్యం: రూ.826.33 కోట్లు
- ఇప్పటి వరకు పంపిణీ: రూ.69 కోట్లు

కార్డు ఒక్కటే.. వేతనాల్లో కోత ఇద్దరికీ..

నూతన ఆరోగ్య పథకంపై ప్రభుత్వ ఉద్యోగుల అభ్యంతరాలు

ఈనాడు, సంగారెడ్డి: ఉద్యోగులు, పింఛనుదారుల కొత్త ఆరోగ్య పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా మూల(బేసిక్)వేతనం నుంచి 1.5 శాతం నిధుల కోత పెట్టడంపై ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పింఛనుదారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వం త్వరలో జారీచేసే హెల్త్‌కార్డు నిమిత్తం భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైనా ఒకరికే వేతనం నుంచి కోత పడుతుందని భావించగా.. ఇందుకు విరుద్ధంగా ఇద్దరి వేతనం నుంచి కోత పడింది. దీంతో పాటు ఐచ్ఛికం తీసుకోకుండానే వేతనంలో కోత విధించడాన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు వ్యతిరేకిస్తున్నారు.

35వేల మందిపై ప్రభావం

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 35వేలకు పైగా ఉద్యోగులు, పింఛనుదారులున్నారు. నూతన ఆరోగ్య పథకం ద్వారా వీరంతా ప్రభావితం కానున్నారు. సంగారెడ్డి జిల్లాలో పదివేల మందికి పైగా ఉద్యోగులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో ఆరువేలు, మెదక్‌లో నాలుగు వేలు, వికారాబాద్‌లో ఐదువేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. పింఛనుదారులు నాలుగు జిల్లాల్లో పది నుంచి పదిహేను వేల మంది ఉంటారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన ఆరోగ్య పథకంతో వీరంతా ప్రభావితం కానున్నారు.

విధానాలే ఖరారు కాలేదు



ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు ఖరారు కాకుండానే మూలవేతనం నుంచి కోత విధించడం సమంజసం కాదు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కోత విధించిన వేతనాలను ఉద్యోగుల ఖాతాల్లో జమచేయాలి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే.. ఒక్కరి వేతనంలో మాత్రమే కోత విధించాలి.

–యాదగిరి, ప్రధాన కార్యదర్శి, టీఎస్ యూటీఎఫ్, సిద్దిపేట

ఉద్యోగుల అభిప్రాయం తీసుకోవాలి



నూతన ఆరోగ్యపథకం నిమిత్తం ప్రభుత్వం ఉద్యోగుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టాలి. ఐచ్ఛికాలు తీసుకున్న తరువాతే వేతనంలో కోత విధించాలి. ఈహెచ్ఎస్ కార్డు నిమిత్తం వేతనాల్లో నుంచి కోతలు విధించకుండా ప్రభుత్వమే భరించాలి. ఆరోగ్యభద్రత కింద ఉద్యోగులు, పింఛనుదారులకు ఆరోగ్య కార్డులు అందించాలి.

–సోమశేఖర్, అధ్యక్షుడు, టీపీటీఎఫ్, సంగారెడ్డి

జిల్లా మత్స్యశాఖ అధికారిణిగా పూర్ణిమ

సంగారెడ్డి టౌన్: జిల్లా మత్స్యశాఖ అధికారిణి పూర్ణిమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు వికారాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.

కార్మికశాఖ ఉప కమిషనర్..

కార్మికశాఖ ఉప కమిషనర్ (డీసీఎల్)గా యాదయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు ఆయనకు మొక్క అందజేసి అభినందించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ట్రెజరీ అధికారి బదిలీ

జిల్లా ట్రెజరీ అధికారి కవిత హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో చీఫ్ అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. మంగళవారం జిల్లా ట్రెజరీ అధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

చెరకు రైతుకు తీపికబురు

- అవస్థలు తెలుసుకునేందుకు కమిటీని నియమించిన ప్రభుత్వం

ఈనాడు, సంగారెడ్డి, న్యూస్‌టుడే, జహీరాబాద్: చెరకు రైతుల కష్టాలు కొలిక్కి రావడం లేదు. సరైన లాభాలు లేక ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. దీంతో రాష్ట్రంలో ఏటేటా సాగువిస్తీర్ణం తగ్గిపోతోంది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం పంటల మార్పిడి దిశగా అన్నదాతలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. గతంలో ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మంతో పాటు ఇతర ప్రాంతాల్లో చెరకు సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా దిగుబడులు రాకపోవడం, గిట్టుబాటు ధరలు కూడా లభించడం లేదు. దీంతో తీపి పంచే రైతుకు చేదు మిగులుతోంది. ఈ నేపథ్యంలో చెరకు సాగుచేసే రైతుల కష్టాలను తెలుసుకోవడంతో పాటు పొరుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని నియమించింది.


జహీరాబాద్‌లో సాగవుతున్న చెరకు పంట

కమిటీ సభ్యులు ఇలా..

పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, చెరకు అభివృద్ధి మండలి సంచాలకులు, గాయత్రి షుగర్స్ లిమిటెడ్ ఛైర్మన్ టి.సరితా రెడ్డి, రైతుల తరఫున సంగారెడ్డి సీడీసీ ఛైర్మన్ జి.రామ్‌రెడ్డి, చెరకు అభివృద్ధి మండలి ముఖ్యశాస్త్రవేత్త, పరిశ్రమల శాఖ సంచాలకులను సభ్యులుగా నియమించారు.

కారణాలు అన్వేషించి..

కమిటీ సభ్యులు మన రాష్ట్రంలో చెరకు విస్తీర్ణం తగ్గేందుకు, ఫ్యాక్టరీల మూసివేతకు గల కారణాలపై సమగ్ర సమాచారం సేకరించనున్నారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి చెరకు రైతుల స్థితిగతులను అధ్యయనం చేయనున్నారు. ఎటువంటి ప్రోత్సాహకాలు ప్రకటిస్తే విస్తీర్ణం పెరిగే అవకాశముంటుందనే దానిపై నివేదిక సిద్ధం చేయనున్నారు. వీటితో పాటు బెల్లం వండడం, ఇథనాల్, బయోగ్యాస్ వంటి చెరకు ఉప ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం, రైతులు చక్కెర మిల్లులపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్కెట్లలో విక్రయించుకునేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించనున్నారు.

ప్రోత్సహిస్తేనే మనుగడ



రాష్ట్ర వ్యాప్తంగా ఏటా చెరకు సాగు విస్తీర్ణం తగ్గుతుండడంతో పరిశ్రమలు మూత పడుతున్నాయి. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ధర పెరగడం లేదు. చక్కెర ఎగుమతులను ప్రభుత్వం నిషేధించడంతో పరిశ్రమలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. రైతులతో పాటు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ప్రకటించాలి. పొరుగు రాష్ట్రాల్లో పర్యటించి మెరుగైన విధానం రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం. సన్న ధాన్యానికి ప్రకటించినట్లుగా చెరకుకు బోనస్ ప్రకటించాలి.

రామ్‌రెడ్డి, సీడీసీ ఛైర్మన్, సంగారెడ్డి

అందోలులో అధికారులకు సూచనలిస్తున్న మంత్రి..

నెరవేరుతున్న పేదల సొంతింటి కల

-రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. అందోలు మండలం మన్‌సానిపల్లి గ్రామంలో సోమవారం నీరుడి జ్యోతి, లావణ్య, సుజాతలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లను మంత్రి ప్రారంభించారు. ఇళ్లు అంటే కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని.. కుటుంబానికి భద్రతతో పాటు.. ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, జోగిపేట ఏఎంసీ మాజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- అందోలు గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, వనతి గృహ భవనాల పనులను సోమవారం మంత్రి రాజనర్సింహ పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పాండు, అందోలు-జోగిపేట పుర అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

DOCUMENTS LOST
I, **G. Vanamma** W/o. **LATE G. Rami Reddy,** Occ: House wife, R/o. Plot No: 862, Road No: 10, Vasanth Nagar Colony, Kukatpally, Hyd-072, T.G. I Lost Original Sale Deed Document No. 5935/87 Plots No.1010 & 1025, in Sy.No.106, Admeasuring 600 Sq. yds, Situated at Indresham (Vi.), Patancheru (M), SangaReddy Dist. Document Missed while Travelling From Kukatpally to Indresham. If anybody found Please
Call: 99635 44446

ప్రజావాణికి 73 వినతులు


కలెక్టరేట్‌లో అర్జీదారులు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజావాణిలో భాగంగా అధికారులకు వినతులు అందజేసి పరిష్కారానికి అభ్యర్థించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఆయా శాఖల అధికారులు వినతులు స్వీకరించారు. మొత్తం 73 అర్జీలు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. - ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరం మేరకు లారీలను ఏర్పాటు చేయాలని, రైతు సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షులు రంగాగౌడ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. - తెల్లాపూర్ పరిధిలోని చెరువులు, కుంటల ఆక్రమణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు నర్సింలు కోరారు.

- తమకు కమ్యూనిటీ హాలు కోసం స్థలం కేటాయించాలంటూ విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- ఆహార సలహా సంఘం సమావేశాలు నిర్వహించాలని సంఘం సభ్యుడు గోవర్ధన్ వినతిపత్రం అందజేశారు.

తొలిరోజు.. ఒకేఒక్కడు



వేసవి సెలవుల అనంతరం ఇంటర్మీడియట్ కళాశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మొదటి రోజు సీఈసీ ద్వితీయ సంవత్సరం విభాగంలో అహ్మద్ బిన్ వాహేద్ ఒక్కడే హాజరయ్యాడు. మిగతా తరగతులకు ఒక్కరూ రాలేదు. తరగతులు పునఃప్రారంభమై తొలిరోజే కావడం.. ఎండలు అధికంగా ఉండటంతో ఎక్కువ మంది హాజరు కాలేదని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.

-ఈనాడు, సంగారెడ్డి, న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

అసిస్టెంట్ సేల్స్‌మెన్ కావలెను
ప్రముఖ దినపత్రికకు చందాదారులను చేర్పించటానికి చురుకైన, చొరవ కలిగిన యువతీ యువకులు కావలెను
అర్హత : పదవ తరగతి ఉత్తీర్ణత
వయస్సు: 19 నుంచి 30 సంవత్సరాల లోపు
తెలుగులో రాయడం, చదవడం వచ్చి ఉండాలి
జీతం : రూ. 15,611.00 + టి.ఎ + డి.ఎ
ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో స్వయంగా సంప్రదించగలరు.
ఇంటర్వ్యూ తేదీ: 3-6-2026
సమయం : ఉ. 10 గం॥ల నుండి సా. 5 గం॥ల వరకు
CIEL HR inspired by science
C/o ఈనాడు కార్యాలయం, సోమాజిగూడ, హైదరాబాద్.
8008595468

అరకొర సిబ్బంది.. ఉపాధికి ఇబ్బంది

భర్తీకి నోచని క్షేత్ర సహాయకుల పోస్టులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

గ్రామీణులకు స్థానికంగానే పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం(వీబీ జీ రామ్ జీ) అమలు చేస్తోంది. ఉపాధి కల్పిస్తూ ఈ పథకం ద్వారా వలసలను దూరం చేస్తున్నారు. పల్లె ప్రజలకు ఉపయుక్తమైన వివిధ పనులు చేపడుతున్నారు. గ్రామాల అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. పథకం ఉద్దేశం మంచిదే అయినా.. క్షేత్ర స్థాయిలో సిబ్బంది కొరతతో అవస్థలు తప్పడం లేదు. క్షేత్ర సహాయకులు కీలకం కాగా ఆ పోస్టులు చాలా చోట్ల ఖాళీగా ఉన్నాయి.

గంగారంలో ఉపాధి హామీ పనులు

613కు 318 మంది మాత్రమే..

జిల్లాలో 613 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. ఆయా పంచాయతీలన్నింటిలోనూ ఉపాధి పనుల పర్యవేక్షణ క్షేత్ర సహాయకుల ద్వారా జరగాల్సి ఉండగా 318 చోట్ల మాత్రమే వీరున్నారు. కొందరిపై గతంలో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకల విషయంలో వేటు పడగా మరికొందరు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి విధులకు దూరమయ్యారు. నూతనంగా ఏర్పాటైన పంచాయతీల్లో క్షేత్ర సహాయకుల నియామకాలు చేపట్టలేదు. క్షేత్ర సహాయకులు లేని పంచాయతీల్లో సంబంధిత పంచాయతీ కార్యదర్శులే ఆ బాధ్యతలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

- జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు: 2.10 లక్షలు
- క్రియాశీలక జాబ్ కార్డులు: 1.15 లక్షలు
- నిత్యం హాజరవుతున్న కూలీలు: 63,000

సాంకేతికత అందుబాటులోకి వచ్చినా..

ఉపాధి హామీ పథకంలో అక్రమాల నిరోధానికి ప్రభుత్వం ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని తీసుకువచ్చింది. రెండుసార్లు హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ విధానం అమలుతో పారదర్శకతకు బాటలు పడే అవకాశం ఉన్నప్పటికీ క్షేత్ర సహాయకుల కొరతతో అమలు ఇబ్బందిగా మారింది. మెట్లు, ఇతర గ్రామాలకు చెందిన క్షేత్ర సహాయకులకు హాజరు నమోదు బాధ్యతలు అప్పగించినా అవస్థలు తప్పడం లేదు.

Indian Bank ALLAHABAD
జోనల్ ఆఫీసు, సివిఆర్ఎన్ రోడ్, మిషన్ హాస్పిటల్ ఎదుట, కరీంనగర్, ఫోన్: 0878-2244388/2244391, సెల్: 9988407241.
కార్యాలయ భవనం లీజు కొరకు టెండర్లు కోరుతూ ప్రకటన.
అమీన్‌పూర్ పటాన్‌చెరువు, సంగారెడ్డి జిల్లాలో 1200 చ.అడుగుల నుంచి 1400 చ.అడుగుల కార్పెట్ ఏరియా గల కార్యాలయ భవనాన్ని (సిద్ధంగా నిర్మించబడిన/నిర్మాణంలో గల) లీజు ప్రాతిపదికన ఆఫరు చేయు కార్యాలయ భవనాల స్వంతదారులనుంచి పబ్లిక్ సెక్టార్ బ్యాంక్ అయిన **ఇండియన్ బ్యాంక్** 2 బిడ్ సిస్టమ్ కింద టెండరులను (టెక్నికల్ మరియు ఫైనాన్షియల్ బిడ్) కోరుతున్నది. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్ సదుపాయంతో ఉండాలి, మరియు మా బ్యాంకు/కార్యాలయం నెలకొల్పుటకు 15 సం.ల వ్యవధికి లీజుకు కావలెను. టెండరు ఫారాలను పైన తెలిపిన చిరునామా నుంచి, **02.06.2026 నుంచి 16.06.2026** మధ్య, రూ.250 (తిరిగి ఇవ్వబడవు)లను డిడి/ఐఓఐ రూపేణా ఇండియన్ బ్యాంక్ పేరిట చెల్లించి పొందవచ్చును. టెండరుల వివరాలు మరియు టెండరు ఫారాలను మా వెబ్‌సైట్ **www.indianbank.in/tenders.** నుంచి పొందవచ్చును. ఏ కారణాలూ చూపకుండానే ఏదైనా లేదా అన్ని ఆఫరులను తిరస్కరించు హక్కును బ్యాంకు కలిగి ఉంది.
జోనల్ మేనేజర్/అసిస్టెంట్ జనరల్ మేనేజర్.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9000014771
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001735